మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## త్యాగం,బలిదానానికి

# ప్రతీక బక్రీద్

- అల్లాహ పరీక్షనెదుర్కొన్న ప్రవక్త ఇబ్రహీం
- సొంత కొడుకు ఇస్మాయిల్‌ను బలిచ్చేందుకు సిద్దమైన ఇబ్రహీం
- బలిపీఠంపై కొడుకును తప్పించి మేకపోతును సృష్టించిన అల్లాహ
- ముస్లింల పవిత్ర పండుగ బక్రీద్ నేడు

**భూత్పూర్,జూన్ 6,ప్రభాతవార్త :** ముస్లింలు త్యాగం,బలిదానానికి బక్రీద్ పండుగను ప్రతీకగా చెబుతారు.వేల సంవత్సరాల క్రితం ఓ నిరుపేద ముస్లిం కుటుంబంలో జరిగిన యధార్థ సంఘటన,గాథనే బక్రీద్‌గా చెప్పుకోవచ్చు.భగవంతుడైన అల్లాహ తన అచంచల భక్తుడైన ఇబ్రహీంను పరీక్షింప తలచి ఇబ్రహీంకు అత్యంత ప్రీతికరమైన వస్తువు,ప్రాణిని తనకు(అల్లాహ)బలివ్వాలని కలలో కోరతాడట.ఎనభయ్యేళ్ల వయోవృద్ధుడైన ఇబ్రహీం రెండొందల ఒంటెలను బలిచ్చేందుకు సిద్ధమయ్యాడట,కొమ్ములు తిరిగిన దున్నలను కూడా బలి ఇస్తాడట.ఇందుకు సంతసించని అల్లాహ ఇబ్రహీంను మరీ పరీక్షింప తలచి తన కన్నకొడుకు ఇస్మాయిల్‌ను బలి ఇవ్వమని కోరతాడట.అందుకు ఏ మాత్రం సంకోచింపని ఇబ్రహీం తన భార్య హాజ్రాకు కూడా చెప్పకుండా తాను అత్యంత గారాభంగా పెంచుకున్న పదమూడేళ్ల ముద్దుల తనయుడు ఇస్మాయిల్‌ను అల్లాహ కోరిక మేరకు బలిచ్చేందుకు బలిపీఠంపై ఎక్కిస్తాడట.అప్పుడు ఆ అల్లాహేయే షైతాన్ రూపంలో వచ్చి అచంచల భక్తుడైన ఇబ్రహీంకు పలు రకాలుగా,పరిపరి విధాల నచ్చచెప్పేందుకు ప్రయత్నించి విఫలుడవుతాడట.అప్పుడు ఇబ్రహీం తనను తన అల్లాహ నుంచి వేరు చేయడానికి షైతాన్ ప్రయత్నిస్తున్నాడని తలచి ద్వేషిస్తాడట.అందుకే ప్రతి ముస్లిం వారి పవిత్ర స్థలం మక్కాలోని మైదానంలో రాళ్లతో షైతాన్‌ను తరిమి తరిమి కొడతారనేదానికి ఇదే తార్కాణమని చెబుతారు.ఇక అల్లాహ కోరాడని నమ్మిన ఇబ్రహీం తన గారాల పట్టి ముద్దుల తనయుడైన ఇబ్రహీంను బలిపీఠంపై ఎక్కించేందుకు సిద్ధమౌతాడట.తాను అల్లాహకు బలి ఇవ్వబోతున్నానన్న అంశాన్ని ఇబ్రహీం తన కుమారుడైన ఇస్మాయిల్‌కు చెబుతాడట.అప్పుడు అల్లాహయే తనను కోరుకున్నప్పుడు బలి ఇచ్చేందుకు ఏ మాత్రం సంకోచింపకుండా తనను బలి ఇవ్వమని ఇస్మాయిల్ తన తండ్రి ఇబ్రహీంతో అంటాడట.తనను బలి ఇచ్చే సమయంలో మనసొప్పకుంటే కళ్లకు గంతలు కట్టుకుని నరకాలని కూడా చెబుతాడట.భగవంతుడ(అల్లాహ)తన కుమారుడికున్న అచంచల భక్తికి ఇబ్రహీం పొంగిపోతాడట.మనస్సు రాయి చేసుకుని,మనోధైర్యం,కొండంత గుండె నిబ్బరంతో బలిపీఠంపై తన కుమారుడైన ఇస్మాయిల్ తలను ఉంచి పొడవాటి కత్తితో తలను నరికేందుకు సిద్ధమవ్వగా ఇంతలో అల్లాహ ఇస్మాయిల్ స్థానంలో ఓ మేకపోతును బలిపీఠంపై ఉంచుతాడట.ఆకాశంలో అల్లాహ ప్రత్యేక్షమై ఇబ్రహీం అకుంటిత దీక్ష,అచంచల భక్తికి మెచ్చి ప్రసన్నుడవుతాడట.నాటి నుంచి నేటి వరకు ప్రతి ముస్లిం ఈ యదార్థ సంఘటనను దృష్టిలో ఉంచుకుని ప్రతీ ఏటా బక్రీద్‌కు కొమ్ములు తిరిగిన మేకపోతులను (అల్లాహ) దేవుడికి బలిగా ఇస్తారని ప్రతీతి.ఇలా నరికిన మేకపోతు శరీరాన్ని(మాంసాన్ని) మూడు భాగాలుగా చేసి ఒక భాగం తన కుటుంబ సభ్యులు,మరొక భాగం బంధుమిత్రులు,చివరి భాగం నిరుపేదలకు పంచి బక్రీద్ పట్ల తమకున్న అచంచల భక్తితత్వాన్ని ప్రదర్శిస్తారు.బక్రీద్ పండుగ ఖుర్బాని పండుగని కూడా అంటారు.

## కర్వెన ఎందుకు

# పూర్తి చేయలె ?



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,చిత్రంలో ఎమ్మెల్యే జీఎంఆర్

- పదేండ్లలో ఉమ్మడి జిల్లాలో ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలే..
- పాలమూరును సస్యశ్యామలం చేస్తాం
- ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేస్తాం
- ప్రపంచంతో పోటీపడేలా రాష్ట్రాన్ని భివృద్ధి చేస్తాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మూసాపేటలో రూ.72కోట్లతో సబ్ స్టేషన్‌లకు భూమి పూజ
- పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు జి మధుసూదన్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి,మేఘా రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్ 6, ప్రభాతవార్త:** వెనుకబడిన పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని, అందుకు కావలసిన నిధులు సంపూర్ణంగా విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో రూ.72 కోట్ల వ్యయంతో (12) 33/11 కె. వి సబ్ స్టేషన్ లు,132/33 కె. వి.(1) విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఆర్‌అండ్‌ఆర్, భూ సేకరణకు సంబంధించిన నిధులు, నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్ల మధ్య ఉన్న గ్యాప్‌ను పూరించేందుకు అవసరమైన నిధులు వెంటనే విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఉదండపూర్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి రూ.70 కోట్లు కావాలి అంటే వాటిని వెంటనే విడుదల చేశామన్నారు. భవిష్యత్తులో ఎన్ని నిధులు అవసరమైతే అన్ని నిధులు విడుదల చేసేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నాటి పాలకులకు ప్రజలపై ప్రేమ లేదని వారి కుటుంబ సభ్యులే వాస్తవాలను బయటపెడుతున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. నిజమైన ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేందుకు, ప్రజలకు నిధులను ఖర్చు పెడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతోనే పోటీపడేలా పరిపాలన చేస్తుందన్నారు. ప్రపంచం మొత్తం తెలంగాణ వైపు చూసేలా పాలనను కొనసాగిస్తున్నామని డిప్యూటీ సీఎం అన్నారు. ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు అండదండలు ఉండాలని కోరారు. వ్యాపారాలు, కాంట్రాక్టులు చేయాలనుకుంటే ఎమ్మెల్యేలు కావాల్సిన అవసరం లేదని.. ప్రజల గొంతుకై శాసనసభలో మాట్లాడి ప్రజల అవసరాలను తీర్చి ప్రజాస్వామ్యంలో ఓటు విలువ పెంచే ఎమ్మెల్యేలను ఎన్నుకున్నందుకు మహబూబ్‌నగర్ ప్రజలను డిప్యూటీ సీఎం అభినందించారు. మాది ప్రజా ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆశయాలే నిజంగా పనిచేస్తామని, వారి ఆశయాలే మా లక్ష్యంగా పరిపాలన అందిస్తామన్నారు.

**పదేండ్లలో ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలే..**

కృష్ణానది ఒడ్డున ఉన్న పాలమూరు బిడ్డలు ఆ నీళ్లను వారి భూముల్లో పారించుకునేందుకు ప్రత్యేక రాష్ట్రం తీసుకొచ్చారని, అయితే 10ఏళ్ల కాలంలో జిల్లాల్లో గత పాలకులు ఒక్క ఎకరాకు సాగునీరు ఇవ్వలేదని విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆనాడు చేపట్టిన జూరాల, కోయిల్ సాగర్, బీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టులన్ని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేశామని గుర్తు చేశారు. నాటి కాంగ్రెస్ పాలకులు పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతిస్తే 2015 జూన్ మాసంలో కర్వెన ప్రాజెక్టు దగ్గర నాటి సీఎం కేసీఆర్ పునాది వేసి మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తాను అని హామీ ఇచ్చారు, పది సంవత్సరాలు అయిన నీళ్లు ఎందుకు పారించలేకపోయారని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. ఎన్నికల ముందు హడావుడిగా నార్లాపూర్ వద్ద పంపు స్విచ్ ఆన్ చేసి వెంటనే ఆఫ్ చేసి అద్భుతం చేశాం, పాలమూరు బంగారం అయ్యిందని అరచేతిలో వైకుంఠం చూపారు.. చందమామ కథలు వినిపించారని డిప్యూటీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. బొంబాయి,బొగ్గుభాయి,దుబాయి అని పాటలు చెప్పిన వాళ్ళు అభివృద్ధిని పక్కనపెట్టి వెళ్లిపోయారని చెప్పారు.

**పాలమూరుపై సీఎం ఫోకస్..**

వెనుకబడిన పాలమూరు జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు పండుగ పేరుతో బహిరంగ సభ నిర్వహించి యావత్ క్యాబినెట్ ను ఆహ్వానించి వివరించిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని యావత్ క్యాబినెట్ అర్థం చేసుకొని విద్యుత్తు, సాగునీరు, విద్యా, వైద్యం, రోడ్లు ఇలా అన్ని రంగాల్లో పాలమూరు అభివృద్ధి చేసేందుకు కావలసిన నిధులు మంత్రివర్గం అందిస్తుందని వివరించారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలతో పాటు ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నామన్నారు.మొదటిదశలో ప్రతి నియోజకవర్గంలో 3,500చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 22,500కోట్లతో మనసున్న ప్రభుత్వం - మిగతా3లో..



డిప్యూటీ సీఎం భట్టికి పూలమొక్క అందజేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి



వేదికపై డిప్యూటీ సీఎం భట్టి, ఎమ్మెల్యేలు జీఎంఆర్, అనిరుధ్‌రెడ్డి,మేఘారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు కొత్వాల్,డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి



హాజరైన ప్రజలు

## బడి బాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి



విద్యాశాఖాధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల అర్బన్, జూన్ 6,ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే కాకుండా, డ్రాప్ అవుట్ అవకుండా ఉండేందుకు బడిబాట కార్యక్రమాన్ని పకడ్బదీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో బడిబాట కార్యక్రమం, ఏకరూప దుస్తుల పై విద్యా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచుటకు కృషి చేయాలని అన్నారు.గత విద్యా సంవత్సరంలో 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న విద్యార్థులందరూ ఈ ఏడాది 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తప్పకుండా పాఠశాలలో నమోదు కావాలన్నారు.అంగన్వాడి కేంద్రాల్లో ఉన్న పిల్లలు ఏ పాఠశాలలో చేరతారో స్పష్టమైన జాబితా తయారు చేసి,ప్రతి విద్యార్థి పాఠశాలలో తప్పకుండా చేరేలా చర్యలు తీసుకోవాలని సంక్షేమ అధికారికి సూచించారు. పాఠశాలకు వెళ్లని పిల్లలను గుర్తించి, వారికి అవసరమైన మార్గనిర్దేశం ఇచ్చి పాఠశాలలో తప్పకుండా చేర్పించాలని అన్నారు.బడిబాట కార్యక్రమం నిర్వహణలో ప్రతి రోజు నిర్వహించే కార్యాచరణను నివేదిక రూపంలో సమర్పించాలని అన్నారు.ప్రతి ఇంటికి వెళ్లి అంగన్‌వాడీ, ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల పిల్లలను గుర్తించి,గ్రామ విద్యా రిజిస్టర్‌ను నవీకరించాలని సూచించారు.బాల్య వివాహాలు జరగకుండా జాగ్రత్తలు0 తీసుకొని,ప్రతి ఒక్కరూ విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో చేర్పు గురించి అవగాహన కల్పించేలా మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని అన్నారు. పాఠశాలలో శుభ్రత,మంచి పారిశుద్ధ్య పరిస్థితులు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసే పాఠ్య,నోట్ పుస్తకాలు,ఏకరూప దుస్తులు, డిజిటల్ విద్య,ఉపకార వేతనాలు, ఇతర ప్రోత్సాహకాల గురించి తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన తీరును క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తూ విద్యార్థుల నమోదును పెంచాలని అన్నారు.పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఏకరూప దుస్తులను జూన్ 12 న విద్యార్థులకు అందించాలన్నారు. ఏపీఎంలు యూనిఫార్ములను జూన్ 11 లోపు తప్పనిసరిగా మండల విద్యా అధికారిలకు సమర్పించాలన్నారు.ఏవైనా సమస్యలు ఉన్న పాఠశాలల వివరాలను స్కూల్ వారీగా సమర్పించాలని,తద్వారా తక్షణమే పరిష్కార చర్యలు తీసుకోవచ్చుని తెలిపారు.అన్ని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థుల దుస్తుల సంఖ్య వివరాలు అందరి వద్ద ఉండాలని , ఏ ఒక్క విద్యార్థికి దుస్తులు అందలేదనే ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ  ్మ నారాయణ,నర్సింగ రావు, డీఈవో అబ్దుల్ గని, డిపిఓ నాగేంద్రం, సంక్షేమ అధికారి సునంద,ఈడి ఎస్సీ కార్పొరేషన్ రమేష్ బాబు,మండల విద్యాధికారులు,ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

- ప్రాధాన్య ప్రాజెక్టుల భూసేకరణపై అధికారులతో సమీక్ష
- భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయండి
- ప్రత్యేక బృందాలతో భూ సర్వేలు వేగవంతం చేయాలని ప్రాజెక్టుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష...
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,జూన్ 6 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో కొనసాగుతున్న మహాత్మాగాంధీ, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, పాలమూరు-రంగారెడ్డి, మార్కండేయ ఇరిగేషన్, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణపై గత నెల 30న సమీక్షలో ప్రాజెక్టుల వారీగా నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం పురోగతి సాధించిన భూసేకరణ పనులపై అదనపు కలెక్టర్ పి.అమరేందర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై ఆయా స్థాయిలో ఉన్న చర్యలను తక్షణమే పూర్తిచేసి భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ప్రాజెక్టుల వారీగా డిస్ట్రిబ్యూషన్ కెనాల్లా వారీగా రెవెన్యూ, సర్వేయర్, ఇరిగేషన్ అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సర్వే పనులను వేగవంతంగా చేపట్టాలని సర్వేయర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ప్రాజెక్టులకు సేకరించిన భూమికి రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు కావలసిన ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ముఖ్యంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి జిల్లా పరిధిలోని 14 ప్యాకేజీల పరిధిలో ప్రాజెక్టుకు కావలసిన 11930.22 ఎకరాల భూసేకరణ కావలసి ఉండగా ఇప్పటి వరకు 11899.07 భూ సేకరణ పూర్తి అయిందని ఇంకా 31.15 ఎకరాల భూ సేకరణ పెండింగ్లో ఉందన్నారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్టుల పరిధిలోని 28వ ప్యాకేజీకి 3907 ఎకరాల భూసేకరణ అవసరం ఉండగా ఇంకా 27 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉందన్నారు. 29వ ప్యాకేజీ పరిధిలోకి 8936 ఎకరాల భూసేకరణ అవసరం ఉండగా, ఇంకా 242 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉందన్నారు. 30వ ప్యాకేజీకి 5327 ఎకరాల భూసేకరణ అవసరం కాగా, ఇంకా 256 ఎకరాల భూ సేకరణ జరగాల్సి ఉందని మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియను ఆయా స్థాయిలలో పనులు పూర్తి చేసి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మార్కండేయ ఎత్తిపోతల పథకానికి 168.69 ఎకరాల భూసేకరణ అవసరం కాగా, 64 ఎకరాల భూసేకరణ పూర్తి అయిందని, మిగిలిన 104.42 ఎకరాల భూ సేకరణ ప్రక్రియకు తక్షణమే సర్వే పనులు పూర్తి చేసి, ఈ నెల చివరి నాటికి భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 3689.19 ఎకరాల భూసేకరణ అవసరం కాగా, ఇప్పటివరకు 30383.22 ఎకరాల భూసేకరణ పూర్తి అయిందని, మిగిలిన 244.15 ఎకరాల భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని రెవెన్యూ మరియు నీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

కర్నెతాండ ప్రాజెక్టుకు సంబంధించి 23 ఎకరాల భూసేకరణ అవసరం కాగా, ఇప్పటివరకు 19 ఎకరాలు పూర్తి అయిందని మూడు ఎకరాల 28 గుంటల భూమిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు శ్రీధర్, పార్థసారథి, మురళి, జిల్లా సర్వే ల్యాండ్ అధికారి నాగేందర్, ఆర్డీవోలు శ్రీను, మాధవి, సురేష్, భూసేకరణ విభాగం కలెక్టరేట్ సూపరిండెంట్ నారాయణ, కార్తీక్ రావు, రెవిన్యూ నీటిపారుదల శాఖల అధికారులు తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

## సంగం బండ రిజర్వాయర్లకు నీటిని వదిలిన ఎమ్మెల్యే



లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

**మక్తల్‌టౌన్,జూన్6 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిన్నగోప్లాపూర్ స్టేజ్1 ఓపెన్ కెనాల్‌ద్వారా భూత్పూర్ రిజర్వాయర్,సంగంబండ ప్రాజెక్టుకు నీటిని మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి విడుదల చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎగువన ఉన్న మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు గాను భీమా నది ఎక్కువగా మారడంతో జూరాలప్రాజెక్టులో నీటిసామర్థ్యం పెరగడంతో మనమక్తల్ నియోజకవర్గంలోని రాజీవ్ఎత్తిపోతల పథకం స్టేజి1నుండి నేడు నీటిని విడుదల చేయడం జరిగింది.ఇప్పటివరకు స్టేజ్1 3పంపులు ఉండగా ఇప్పటివరకు కేవలం 2పంపులు మాత్రమే ఉపయోగంలో ఉండగా మూడవ పంపు 2018 ఉంది నిరూప యోగంగా ఉండగా అందుకుగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూడవ పంపుగాను గత సంవత్సరం డిసెంబర్లో ఒక కోటి 4 లక్షల రూపాయల నిధులను మూడో పంపు మరమ్మత్తుల నిమిత్తంనిధులను విడుదలచేయడం జరిగిందన్నారు. గత సంవత్సరం జూన్ 13న నీటిని విడుదల చేయగా ఈ సంవత్సరం ఒక వారానికి ముందే నీటిని విడుదల చేయడం జరిగిందని అందుకు స్టేజ్ వన్‌లోని సాంకేతికపరమైనయంత్రాలను పూర్తిస్థాయిలో ఆధునీకరణచేసి అన్ని యంత్రాలను పనిచేసే విధంగా ఏర్పాటు చేయడానికి నిధులు సమకూర్చినటువంటి భారీనీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డికి మక్తల్ నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంభందిత నీటి పారుదల ప్రభుత్వాధికారులు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఏ.రవికుమార్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు, అభిమానులు చుట్టుపక్కల గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య : జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి

**భూత్పూర్,జూన్ 6,ప్రభాతవార్త :** ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి పిలుపునిచ్చారు.ప్రొఫేసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం భూత్పూర్ మండలం పోతులమడుగు గ్రామంలో కలెక్టర్ విజయేంద్రబోయి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థులు మంచి ఉద్యోగాలలో స్థిరపడ్డారని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని రకాలైన మౌలికసదుపాయాల్ని కల్పిస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో అర్హతలు,అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు పనిచేస్తున్నారన్నారు.ప్రభుత్వ బడుల్లో తెలుగు,ఆంగ్ల మాధ్యమాలలో బోధన నిర్వహిస్తూ,అన్ని రకాలైన అహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన జరుగుతోందని తెలిపారు.పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి నాణ్యమైన విద్యనందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషిచేయాలని కలెక్టర్ విజయేంద్రబోయి సూచించారు.ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు,పాఠశాలల కమిటీ సభ్యులు తమ వంతు కర్తవ్యంగా 5నుంచి 15ఏళ్ల లోపు బడిఈడు పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు.ప్రొఫేసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఈ నెల 6నుంచి 30వ తేది వరకు జిల్లాలో పకడ్బంధీగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.నది,ఇంటర్ ఫెయిల్ విద్యార్థులు ప్రభుత్వం నిర్వహించే ఓపెన్ స్కూల్‌లో పరీక్షలు రాయవచ్చని అన్నారు.ఉల్లాస్ వయోజన విద్య కార్యక్రమం ద్వారా అక్షరాస్యులైన నిరుద్యోగులు - మిగతా3లో..




బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రబోయి



సమావేశానికి హాజరైన అధికారులు,ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు

## ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య : కలెక్టర్

**మొదటి పేజీ తరువాయి**

వయోజనులు,నిరక్షరాస్యులకు చదవడం,రాయడం వంటి బేసిక్ విద్యను నేర్పించాలని సూచించారు.

**నిర్ణీత సమయంలో భూసమస్యల పరిష్కారం**

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3నుంచి నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులలో రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.భూభారతి రెవెన్యూ సదస్సులో ఇచ్చిన ధరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ విజయేంద్రబోయి స్పష్టం చేశారు.రైతులు భూభారతిలో భూ సమస్యలకు సంబంధించి ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.రెవెన్యూ అధికారులు స్వయంగా భూభారతి రెవెన్యూ సదస్సులు ఉచితంగా ధరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో భూత్పూర్ మండల తహశిల్దార్ కిషన్‌నాయక్,డిప్యూటీ గీత,ఎంపిడీఓ ప్రభాకర్‌చారి,మండల విద్యాకారిణి ఉషారాణిలతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం,ఏపీఎం,అంగన్వాడీ సూపర్‌వైజర్లు,మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమేష్‌చందర్,మాజీ సర్పంచి హరియా నాయక్‌తో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,ఎస్‌హెచ్‌జీ మహిళలు,గ్రామస్తులు, పాల్గొన్నారు.

## గోపనపల్లిలో బడిబాట ర్యాలీ

**దేవరకద్ర, జూన్ 6 ప్రభాతవార్త :** దేవరకద్ర నియోజకవర్గం గోపనపల్లి గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్లాకు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామసభలో భాగంగా మహిళా సంఘాలు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రైవేటు పాఠశాల వద్దు ప్రభుత్వ పాఠశాలనే ముద్దు అని హెచ్‌ఎం ప్రసంగించారు. బడి ఈడు పిల్లలను గుర్తించి ఎనిమిది నుంచి పదవ తరగతి వరకు కరపత్రాలతో ఇంటింటా ప్రచారం నిర్వహించాలని అంగన్వాడి కేంద్రాలతో పాటుగా బడిలో చేర్పించాలని ప్రత్యేక అవసరాలకు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా చొరవ తీసుకొని ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలామణి, రవీందర్, భాగ్యలక్ష్మి, ఆశా వర్కర్లు జయలక్ష్మి గ్రామ పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.

## పత్రిక స్వేచ్ఛకు భంగం కలిగించడం సరికాదు



వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

**జడ్చర్ల, జూన్6,ప్రభాతవార్త:** ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తున్న జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టి పత్రికా స్వేచ్ఛకు భంగం వాటిల్లకుండా చూడాలని జర్నలిస్టులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జడ్చర్ల తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ తిరుపతయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జడ్చర్ల సీనియర్ రిపోర్టర్ కృష్ణ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడ మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా వార్తలు రాసి ప్రచురించిన జనంసాక్షి దినపత్రిక ఎడిటర్ ఏం ఏం రెహమాన్‌పై పోలీసులు తప్పుడు కేసులు పెట్టడం సరికాదన్నారు.పోలీసులు ఇప్పటికైనా పత్రికా యాజమాన్యాలపై, విలేకరులపై తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలని లేదంటే భవిష్యత్‌లో ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్చర్ల విలేకరులు శ్రీధర్, సత్తార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులలోనే నాణ్యమైన విద్య : డిఈఓ



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న డీఈఓ రమేష్‌కుమార్

**వెల్దండ, జూన్ 06 ప్రభాతవార్త:** విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, తల్లి దండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని డీఈఓ రమేష్ అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో నిర్వహించిన గ్రామసభకు డీఈఓ రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంఈఓ చంద్రుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షితులైన ఉపాధ్యాయులచే ఇంగ్లీష్ విద్యాబోధన అందుతుందని,ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్నభోజనం అందించబడుతాయని,మనఊరి మనబడిలోనే విద్యార్థులను చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. విద్యా సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం బడిబాట కార్యక్రమం చేపట్టిందని అందులో ఈనెల 6వ తేదీ శుక్రవారం నుండి 19వతేదీవరకు ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీచేసిందని ఉపాధ్యాయులు గ్రామాలలో ఇంటింటిప్రచారం నిర్వహించాలని బడీడు పిల్లలను గుర్తించి జాబితా రూపొందించి వారి పాఠశాలలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ కేంద్రాలలో 5 సంవత్సరాలు పైబడిన వారిని గుర్తించి పాఠశాలలో చేర్పించాలని ఈనెల 12వతేదీన పాఠశాలలను పండుగవాతావరణంలో పునఃప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ఎంపీడీఓ లక్ష్మణ్,మహిళా సమైక్యఅధ్యక్షురాలు భారతమ్మ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, రవీందర్, సుగుణతోపాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌ను నియంత్రించాలి: మున్సిపల్ చైర్‌పర్సన్



జ్యూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

**జడ్చర్ల, జూన్6,ప్రభాతవార్త:** 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఆరు మార్పు అభివృద్ధికి మలుపు అనే కార్యక్రమాన్ని 5వ రోజు జడ్చర్ల మున్సిపాలిటీలోని 3వ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తడి చెత్త,పొడి చెత్త వేరు వేరు చేసి ఎరువులుగా తయారు చేసి మొక్కలకు ఉపయోగించేలా చూడాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులు వాడకుండా జ్యూట్ బ్యాగులను మాత్రమే వినియోగించాలని,పర్యావరణాన్ని పరిరక్షించాలని చైర్ పర్సన్ మహిళా సంఘం సభ్యులకు సూచించారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ లక్ష్మారెడ్డి, వార్డ్ కౌన్సిలర్ సతీష్, శానిటరీ ఇన్స్పెక్టర్ నరేష్, మహిళా సంఘం సభ్యులు బాలమణి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సేద్యంలో రసాయనాలను తగ్గించాలి

**జిల్లా ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ భరత్‌భూషణ్‌రావు**

**భూత్పూర్,జూన్ 6,ప్రభాతవార్త :** రైతులు సేద్యంలో సాధ్యమైనంతవరకు రసాయనాలను తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ భరత్‌భూషణ్‌రావు సూచించారు.శుక్రవారం భూత్పూర్ మండలం కరివెన గ్రామంలో భూత్పూర్ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'అనే కార్యక్రమంలో డాక్టర్ భరత్‌భూషణ్‌రావు పాల్గొని రైతులనుద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ రసాయనాలను తగ్గించడంతో పాటు పంటమార్పిడి పద్ధతిని అవలంభించాలని సూచించారు. పంటమార్పిడిలో పప్పుజాతి పంటలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని కోరారు.రైతులు రసాయనాలను కొనేప్పుడు వాటికి సంబంధించిన రసీదులను తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో పాల్గొన్న పాలెం వ్యవసాయ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె కల్యాణి మాట్లాడుతూ రైతులు పొలం గట్లు ఖాళీ భూములలో విరివిగా చెట్లు పెంచాలని సూచించారు.భూసారాన్ని పెంపొందించేందుకు కృషిచేయాలని అన్నారు.వ్యవసాయ వ్యర్థాలను కాల్చకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మురళిధర్,వ్యవసాయ విస్తరణ అధికారి ఆనందస్వామితో పాటు వ్యవసాయ విద్యార్థులు,రైతులు పాల్గొన్నారు.

## భూత్పూర్‌కు మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు

**- పట్టణ,మండల కాంగ్రెస్ అధ్యక్షులు, లిక్కి నవీన్‌గౌడ్,కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి**

**భూత్పూర్,జూన్ 6,ప్రభాతవార్త :** దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యే జీఎంఆర్ చొరవతో రు.33కోట్ల నిధులతో పన్నెండు 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్లతో పాటు ఒక 132/133 కెవి సబ్‌స్టేషన్ ఏర్పాట్లకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క శుక్రవారం మూసాపేట మండలం వేములలో భూమి పూజ చేశారని పట్టణ,మండల కాంగ్రెస్ అధ్యక్షులు లిక్కి నవీన్‌గౌడ్,కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలు పేర్కొన్నారు.33/11కెవి సబ్‌స్టేషన్లు భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో,మండలంలోని మద్దిగట్ల,తాటికొండ గ్రామాలలో ఏర్పాటుకు శంకుస్థాపనలు జరిగాయని పేర్కొన్నారు.అమిస్తాపూర్ సబ్‌స్టేషన్‌కు రు.3.62కోట్లు,మద్దిగట్ల సబ్‌స్టేషన్‌కు రు.3.61కోట్లు,తాటికొండ సబ్‌స్టేషన్‌కు రు.1.75కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

# భూత్పూర్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టికి ఘనస్వాగతం

**- స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు జీఎంఆర్, అనురుధ్‌రెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు**



భూత్పూర్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను శాలువతో సన్మానించి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్



మల్లు భట్టి విక్రమార్కను భూత్పూర్‌లో గజమాలతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్ ఇతర కాంగ్రెస్ నాయకులు

**భూత్పూర్,జూన్ 6,ప్రభాతవార్త :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా భూత్పూర్ చౌరస్తా,జాతీయ రహదారి-44 కూడలిలో భట్టికి జిల్లా ఎమ్మెల్యేలు,నాయకులు ఘనస్వాగతం పలికారు.జిల్లా పర్యటనలో భాగంగా ఉపముఖ్యమంత్రి భట్టి మూసాపేట మండలం వేములలో దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించి రు.33కోట్లతో ఏర్పాటు చేస్తున్న పన్నెండు 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్లకు భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేసేందుకు వచ్చారు.శుక్రవారం ఉదయం భూత్పూర్ జాతీయ రహదారి కూడలిలో దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్)తో పాటు జడ్చర్ల ఎమ్మెల్యే అనురుధ్‌రెడ్డి,రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాసరెడ్డి,భూత్పూర్ మాజీ ఎంపిపి కదిరె శేఖర్‌రెడ్డిలు గజమాలతో ఘనంగా సన్మానించి స్వా గతం పలికారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్ కుమార్‌గౌడ్,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి,మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రావులపల్లి మొల్గర నర్సింహులు,మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్,మండల కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు జైదు శ్రీనివాసులు,పట్టణ ఓబీసీ సెల్ అధ్యక్షుడు ఆగిరి రవిలతో పాటు నాయకులు గోవర్ధన్‌గౌడ్,బోరింగ్ నర్సింహులు,గద్దం ఎల్లప్ప,బజార్ పరుశురాం,వడ్డె శ్రీనివాసులు, దెండి లక్ష్మికాంత్‌రెడ్డి, మశ్చేందర్, మొల్గర వెంకటేష్,నర్సింహులు,రవీందర్‌రెడ్డి,రాంరెడ్డి,కిట్టురెడ్డి,టీవీ రెడ్డి,పవన్,అఫ్రోజ్,తమన్న గౌడ్,మాసగౌడ్,శివరాములు,జమీర్,మాధవరెడ్డి,శేఖర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

# కర్వెన ఎందుకు పూర్తి చేయలె ?

**మొదటి పేజీ తరువాయి భాగం..**

హృదయంతో ఆలోచించి నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మిస్తుంది అన్నారు.29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్తు సర్వరా చేస్తున్నాం ఇందు గాను ప్రతి సంవత్సరం విద్యుత్ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం 12,500 కోట్లు కడుతుంది అన్నారు. 200 యూనిట్ల వరకు విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన పనిలేదని, పేదలకు డబ్బులు మిగలాలనే ఆలోచనతో ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చిని అన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకం ద్వారా రాష్ట్రంలో 50 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి ఈ పథకానికి ప్రభుత్వం ఏడాదికి 200 కోట్లు చెల్లిస్తుందని వివరించారు. ఒక దేవరకద్ర నియోజకవర్గం లోని 45,155 మంది అంటే 71 ఒకశాతం గృహ జ్యోతి పథకాన్ని వినియోగించుకుంటున్నారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళలు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్నారు గతంలో ఆర్థికంగా బలంగా ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాలను ఎందుకు అమలు చేయలేకపోయిందని ప్రశ్నించారు. జనంలో సగభాగమైన మహిళలను ఐదు సంవత్సరాలలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి సంవత్సరం 21 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు స్వయం సహాయక సంఘాలకు అందించామని తెలిపారు. టిఆర్ఎస్ నాయకులకు 10 సంవత్సరాలపాటు మహిళలు ఎందుకు గుర్తు రాలేదని ప్రశ్నించారు. బలహీనవర్గాల పిల్లలు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పాఠశాలల్లో చదవించాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించింది ఇందుకోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం అన్నారు. ఇప్పటికే వంద శాసనసభ నియోజకవర్గాల్లో భూమి పూజలు చేశామని తెలిపారు. 10 సంవత్సరాల పాటు పరిపాలించిన వారికి పేద బిడ్డలు చదువుకునే గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో డైట్ చార్జీలు పెంచాలన్న ఆలోచన రాలేదు, ఇందిరమ్మ ప్రభుత్వం రాగానే మన బిడ్డలు బాగా తింటేనే చదువులపై దృష్టి పెట్టగలుగుతారని ఆలోచించి 40 శాతం డైట్ చార్జీలు 200 కాస్మోటిక్ చార్జీలు పెంచామని తెలిపారు. కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో 10 సంవత్సరాల పాటు నిరుద్యోగుల ఆశలు ఆవిరి అయ్యాయి, వారి కలలను నిజం చేసేందుకు ప్రజా ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే 56వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసింది మరో 30 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయబోతున్నాం అని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు రాని యువత వారి కాలపై వాళ్లు నిలబడేందుకు ఎనిమిది వేల కోట్లతో ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం అనే పదాన్ని త్వరలో ప్రారంభించబోతున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సోనియాగాంధీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అడవి బిడ్డల కోసం వారు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇచ్చారు. గిరిజన బిడ్డలు సాగు చేసుకునేందుకు పోతే వారినీ ట్రాక్టర్లు, బుల్డోజర్లతో గత పాలకులు తొక్కించారు, అడ్డం పోయిన గిరిజన మహిళలను చెట్టుకు కట్టేసి కొట్టిన చరిత్ర గత పాలకులు ది అని డిప్యూటీ సీఎం భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం రాగానే గిరిజన బిడ్డలు ఆత్మగౌరవంతో తలెత్తుకొని బతికేలా 12,600 కోట్ల రూ. ల తోఇందిరా సౌర గిరిజల వికాసం అనే పథకాన్ని తీసుకువచ్చాం అన్నారు. రాష్ట్రంలోని గిరిజనుల ఆధీనంలో ఉన్న 6.70 లక్షల ఎకరాల్లో ఉచితంగా బోరు బావులు, సోలార్ పంపు సెట్లు, అవకాడో వంటి మొక్కలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ జి. విజయేందిర బోయి,ట్రాన్స్ కో సి.ఎం.డి.కృష్ణ భాస్కర్,టి.జి.ఎస్.పి.సి.డి.ఎల్.సి.ఎం.డి.ముషారఫ్ ఫారూఖీ,రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు పాల్గొన్నారు.

# వరిధాన్యానికి ఆన్లైన్ ద్వారానే చెల్లింపులు జరుగాలి



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల అర్బన్ జూన్ 6,ప్రభాతవార్త:** చెల్లింపులు సేకరించిన వరి ధాన్యానికి అన్ లైన్ ద్వారా వెంటనే చెల్లింపులు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో వరి ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో మండలాల వారిగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో 90 శాతం ధాన్యం సేకరించడం జరిగిందని, మిగిలిన 10 శాతం ధాన్యాన్ని త్వరితగతిన సేకరణ పూర్తి చేయాలన్నారు.గత రబి సీజన్ లో 3వేల టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయగా, ఈసారి ఎన్నడు లేని విధంగా 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని తెలిపారు.గతం కంటే 3వేల శాతం వరిధాన్యం అధికంగా సేకరించినట్లు వివరించారు. వర్షాలు కురుస్తున్నప్పటికిని రైతులకు ఇబ్బంది కలగకుండా జిల్లాలో వరి ధాన్యం సేకరణ పట్ల అధికారుల కృషిని కలెక్టర్ సంతృప్తిని వ్యక్తపరిచారు.సేకరించిన వరి ధాన్యానికి వెంటనే చెల్లింపులు జరగేలా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వారం రోజుల్లో 100 శాతం పూర్తి చేయాలని అన్నారు. గన్ని బ్యాగుల వినియోగాన్ని పునఃసమీక్షించి, వివరాలతో కూడిన నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు.ఈ సీజన్‌లో ఎదురైన సమస్యలు, అవసరమైన కొత్త కొనుగోలు కేంద్రాలపై వివరాలతో కూడిన నివేదికను ఒక వారం లోపు సమర్పించాలని,తద్వారా తదుపరి సీజన్‌లో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవచ్చని సూచించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమన్వయంతో, వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగ రావు, పౌరసరఫరాల అధికారి స్వామికుమార్, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీనివాసులు,ఏపీఎం లు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హయాంలో కేవలం మఖ్తల్ అభివృద్ధి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**మక్తల్ టౌన్, జూన్ 6 ప్రభాతవార్త:** మఖ్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డులు, 24 పోలింగ్ బూత్‌లకు గాను గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్తగా వెయ్యికి పైగా రేషన్ కార్డులు, 300 ఇందిరమ్మ ఇండ్లు, 300 రాజీవ్ యువ వికాసం యూనిట్లను మంజూరు చేయించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకి అదేవిధంగా మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు డా. వాకిటి శ్రీహరికి దక్కుతుందని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి ఆదేశాలతో కాంగ్రెస్ కార్యాలయంలో టౌన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతన రేషన్ కార్డులపై ఈనెలలో ఒకేసారి మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం అందజేస్తున్నామని అన్నారు. గతంలో మున్సిపాలిటీలోనే కాకుండా నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ మంజూరు కాలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హయాంలో కేవలం మఖ్తల్ మున్సిపాలిటీలోనే 300ల ఇందిరమ్మ ఇండ్లు, నియోజకవర్గ స్థాయిలో దాదాపు 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. నిరుద్యోగ యువతకు మఖ్తల్ మున్సిపాలిటీ పరిధిలో 300 రాజీవ్ యువ వికాసం యూనిట్లను అందిస్తున్నామని అన్నారు. గతంలో పేదలకు ఇండ్లు, రేషన్ కార్డులను గాలిలో దీపంలా చూయించారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని పేదలకు అందిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ పేదల ప్రభుత్వమని, వారి అభివృద్ధి కోసం పాటుపడుతుందని అన్నారు. పట్టణ అధ్యక్షులు ఎ.రవికుమార్, కార్యక్రమంలో సీనియర్ నాయకులు కట్టా సురేష్ , దండు రాము బ్యాగరి సురేష్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య : ఆర్డీఓ రాంచందర్ నాయక్



బడిబాటలో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

**నారాయణ పేట, జూన్ 6 ప్రభాతవార్త :** నారాయణపేట పరిధిలోని జాజాపూర్ గ్రామ ప్రాథమిక ఉన్నంత పాఠశాలలో అన్నీ వసతులతో నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందంతో ప్రభుత్వ బడిల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాలైనటువంటి వసతులు ఉంటాయని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ రామచంద్రనాయక్ అన్నారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన జాజాపూర్ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు.గ్రామసభలో బడిబాట కార్యక్రమానికి సంబంధించినటువంటి బడిబాట ప్రతిజ్ఞను విద్యార్థి తల్లిదండ్రులచే చదివించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ విద్యార్థులందరినీ ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే చేర్పించాలని గ్రామ సభలో తెలియజేశారు. గ్రామసభలో కార్యక్రమంలో మండల తహసిల్దార్ అమరేందర్ కృష్ణ, గ్రామ నాయకులు జగన్ మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుమలత, మాజీ ఎంపీటీసీ శేఖర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉర్దూమీడియం అమీరుద్దీన్,బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం సింగారం గ్రామాన్ని ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయడం జరిగింది.ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విజయ, భాను ప్రకాష్, లక్ష్మణ, మంగళ మధుసూదన్ రావు,ప్రతాప్,శశిరేఖ,శిరీష,శ్రీదేవి, నరసింహ, రఘురాం రెడ్డి, మాణిక్యప్ప బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వీర నాగమ్మ ఉత్సవాలలో ఎమ్మెల్యే కసిరెడ్డి



అమ్మవారి ఉత్సవాల్లో ఎమ్మెల్యే, పలువురు నాయకులు

**వెల్దండ,జూన్6ప్రభాతవార్త:** మండలకేంద్రంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన వీర నాగమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వీర నాగమ్మ అమ్మవారి ఉత్సవాలలో ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవతలను పూజించడం ఆచారంగా వస్తుండడంతో గ్రామాల్లో అమ్మవారి దయవల్ల ప్రజలందరూ సుభిక్షంగా జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కసిరెడ్డికి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పిసిబి మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్, వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, కిసాన్ సెల్ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, పురుషోత్తంచారి, నాగయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

## భూ భారతి రెవెన్యూ సదస్సులకు భారీగా దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న నయాబ్ తహసీల్దార్ లికిత రెడ్డి, సిబ్బంది

**బాలానగర్, జూన్ 6 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలోని నేరెళ్లపల్లి, మోతీఘనపూర్ గ్రామాలలో శుక్రవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులకు దరఖాస్తులు భారీగా వచ్చాయి. తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, నయాబ్ తహసిల్దార్ లిఖిత రెడ్డి తమ సిబ్బందితో కలిసి రెండు గ్రూపులుగా ఏర్పడి, ప్రతిరోజు రెండు గ్రామాలలో భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. శుక్రవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో నేరేళ్ల పల్లిలో 40 దరఖాస్తులు, మోతి ఘనపూర్‌లో 157 దరఖాస్తులు వచ్చాయని తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## నిశ్చితార్థ వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

**ఉట్కూరు,జూన్ 6 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మాజీ ఎంపీటీసీ కోరం పద్మావెంకటరెడ్డి కుమార్తె నిశ్చితార్థానికి మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.ఆయనతో కుటుంబసభ్యులు శంకర్ రెడ్డి, పోలీస్ కానిస్టేబుల్ గోపాల్,కోరంశివరాజ్,మాజీ సర్పంచ్ సూర్య ప్రకాష్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి అరవింద్ కుమార్, మాజీ రైతు సమావేశం మండలఅధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి,మండల యూత్అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి టౌన్ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, సురేష్, తరుణ్ రెడ్డి, నారాయణ, రాజుల అశిరెడ్డి, కుటుంబ సభ్యులు శంకర్ రెడ్డి, పోలీస్ కానిస్టేబుల్ గోపాల్, కోరం శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**వెల్దండ, జూన్ 06 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రానికి చెందిన జంగిలి ఆంధ్రయ్య గురువారం రాత్రి పూజా కార్యక్రమంలో పాల్గొని ఇంటికి తిరిగి వెళుతుండగా వీధి కుక్క తీవ్రంగా దాడి చేయగా ముఖంపై తీవ్ర గాయాలపాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి బాధితుడు ఆంధ్రయ్యను 108 ద్వారా కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుండి ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉన్నదని వాటిని అరికట్టాలని గ్రామస్తులు కోరారు.

## పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ



ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

**గద్వాల అర్బన్, జూన్ 6 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలు జూన్ 12వ తేదీన పునః ప్రారంభం కావడంతో శుక్రవారం ఎర్ర వల్లి మండల విద్యాశాఖ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ పాఠ శాలల ఉపాధ్యాయులకు విద్యార్థులకు సంబంధించి 12,వేల 511 పాఠ్యపుస్తకాలను మండల విద్యాశాఖ అధికారి అమీర్ పాష పంపిణీ చేశారు. అదే విధంగా జూన్ 12వ తేదీన పాఠశా లలు పున: ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్త కాలను పంపిణీ చేయాలని ఉపాధ్యాయులను ఎంఈఓ అమీర్ పాష ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రభు త్వ ప్రధానోపాధ్యాయులు. ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పదేళ్లలో చేయలేని అభివృద్ధి యాడాదిలో చేసాం

**నవాబుపేట సబ్ స్టేషన్ల మంజూరు కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి**

**నవాబుపేట,జూన్ 6 ప్రభాతవార్త :**గత పదేళ్లలో చేయలేని అభివృద్ధిని కేవలం ఏడాదిన్నర సమయంలోనే చేసి చూపించామని నవాబుపేట మండల కేంద్రంలో 16సబ్‌స్టేషన్ల మంజూరు కార్యక్రమంలో ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సంవత్సర కాలంలోనే పలు అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో అమలుపరిచామని ఈ సందర్భంగా తెలియజేశారు. సన్న బియ్యం ఇస్తున్న ఘనత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని మహిళల ఆర్థిక స్వావలంబన కోసం సోలార్ యూనిట్లు, ప్రతీ మండల కేంద్రంలో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామని అకాడమిక్ సంవత్సరం ప్రారంభం రోజునే ఉచిత పుస్తకాలు, యూనిఫాములు ఇస్తున్నామన్నారు. బిఆర్‌యస్ గత పదేళ్లలో నియోజక వర్గానికి చుక్క నీరివ్వలేదు పాలమూరు రంగారెడ్డిని 3 ఏళ్లలో పూర్తి చేస్తానని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ ఎందుకు పూర్తి చేయలేదు. రాజకీయాలకతీతంగా కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్స్ ఇస్తున్నాం కేసీఆర్ రాష్ట్ర ఖజానాను మొత్తాన్ని కాళేశ్వరం పేరుతో కొల్లగొట్టారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్య లేకుండా విరివిగా సబ్ స్టేషన్ లు నెలకొల్పి రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. జడ్చర్ల నియోజకవర్గంలో రూ. 42 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న (1) 132/33 కె.వి సబ్ స్టేషన్,రూ.54.37 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న (16) 33/11 కె.వి సబ్ స్టేషన్‌లకు ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క భూమిపూజ చేశారు. సబ్ స్టేషన్‌ల వివరాలు (1) నవాబ్ పేటలో 132/33 కె.వి సబ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. నియోజకవర్గంలో (16) 33/11 కెవి సబ్ స్టేషన్లు ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడితో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

## ప్రతి సమస్యకు పరిష్కారం

**న్యాయ అవగాహన సదస్సులో పాల్గొన్న జస్టిస్ ఇందిర**

**మహబూబ్‌నగర్,జూన్6, ప్రభాతవార్త:** ఎలాంటి సమస్య ఎదురైనా ఆందోళన అవసరం లేదు అని ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జస్టిస్ ఇందిర తెలిపారు. మహబూబ్ నగర్ పట్టణం లోని మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రంలో మహిళలకు ఆమె న్యాయ సలహాలు సమస్యలపైన అవగాహన సదస్సును నిర్వహించారు.ఎప్పుడుకూడా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. అనంతరం మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణాన్ని రక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రం పర్యవేక్షకులు గుండా మనోహర్, సెట్విన్ విజయ్ కుమార్, కె.రవికుమార్,గన్నోజు చంద్రశేఖర్, రాజ సింహుడు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జస్టిస్ ఇందిర

## లక్ష్మిపల్లిలో అట్టహాసంగా బడిబాట ప్రారంభం

**దేవరకద్ర, జూన్ 6 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆచార్య జయశంకర్ బడి బాట కార్యక్రమం దేవరకద్ర మండలం లక్ష్మిపల్లిలో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆచార్య జయశంకర్ సార్ చిత్ర పటానికి హెచ్‌యంలు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి లాంఛనంగా బడి బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాల గురించి ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్ తల్లిదండ్రులకు క్షుణ్ణంగా వివరించారు. గ్రామంలోని బడి ఈడు వయస్సు కలిగిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్‌యంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు,యువకులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున బడి బాట కార్యక్రమంలో పాల్గొని బడి ఈడు కలిగిన పిల్లలను బడిలో చేరుస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల హెచ్‌యంలు ఎస్.కల్పన, కెకె శ్రీనివాస్, ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్, విజయలక్ష్మి, నాగేశ్వర్‌రెడ్డి, దోమ శంకర్, ఆస్రా ఖాద్రి, కమల్ రాజ్, మదన్ మోహన్, సుజాత, గ్రామస్థులు రాములు, కొండయ్య, శ్రీనివాసులు, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు మారిన సమస్యలను మారవా..

**పట్టణ కార్యదర్శి కించే నారాయణ, టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎదురింటి నర్సింలు**

**నారాయణపేట టౌన్, జూన్ 6 ప్రభాతవార్త :** ప్రభుత్వాలు మారినా చేనేత కార్మిక సమస్యలను పట్టించుకునే వారు లేరని సిపిఐ (యంఎల్) మాస్‌లైన్ పార్టీ పట్టణ కార్యదర్శి కించే నారాయణ, టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎదురింటి నర్సిములు అన్నారు. శుక్రవారం నారాయణపేట పట్టణంలో చేనేత కార్మికులతో సమావేశమై వారు మాట్లాడుతూ నారాయణపేట పట్టణంలో 20 నుండి 30 సంవత్సరాల నుండి చేనేత కార్మికుల సంఘం లేని కారణంగా ప్రభుత్వపరంగా ఏ పథకం వచ్చిన అధికారులు, మధ్యవర్తుల కారణంగా చేనేత కార్మికులు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. చేనేత కార్మిక అంతా నిరక్షరాస్యులు అన్నారు. వారి నైపుణ్యం ముందు ఏ కళాకారులు సాటిరారన్నారు. ప్రభుత్వాలు ఆయన చేనేత కార్మికుల సమస్యలను పట్టించుకునేవారు లేరన్నారు. వారి సమస్యల పరిష్కారం నేటికి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. చేనేత కార్మికులకు అండగా నారాయణపేట పట్టణంలో తెలంగాణ ప్రగతిశీల చేనేత కార్మిక సంఘం ఏర్పాటు సిపిఐ (యంఎల్) మాస్ లైన్ పార్టీ పట్టణ కార్యదర్శి కెంచి నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. అధ్యక్షులుగా తులసి దాస్, ఉపాధ్యక్షులుగా ఉమా, లలితా బాయి, సుజాత, ప్రధాన కార్యదర్శిగా మోబిన్, కార్యదర్శిగా సంగీతా భాయ్, శాంతాబాయి, హైరుణ్ బీ, అత్తర్ మునిసా, సహాయ కార్యదర్శులతో బాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులతో పాటు తదితరులు ఉన్నారు.

## మత్తుమందు సరఫరా చేసే వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకుంటాం

**ప్రెస్‌మీట్‌లో నిందితుల వివరాలు వెల్లడించిన డీఎస్పీ**

**సిఐ, ఎస్ఐ,కానిస్టేబుళ్లను అభినందించిన డిఎస్పి వెంకటేశ్వర్లు**

**పెబ్బేరు,జూన్ 6 ప్రభాతవార్త :** పెబ్బేరు పోలీస్ స్టేషన్లో గురువారం రోజు దొరికిన మత్తు పదార్థం ఆల్ఫాజోలం నిందితులను పట్టుకున్న సీఐ, ఎస్ఐ, కానిస్టేబుల్ అభినందించి డిఎస్పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గురువారం రోజు దొరికిన కల్లులో వినియోగించే మత్తు పదార్థం ఆల్ఫాజోలం నిందితులు ఇద్దరు దొరికారని మిగతా తొమ్మిది మంది పరారీలో ఉన్నారని తెలియజేశారు. నిందితుల వివరాలు జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం బింగి దొడ్డి గ్రామానికి చెందిన నర్సింహులు గౌడ్, గట్టు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ గౌడ్ ఇద్దరు వ్యక్తులు పెబ్బేరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మార్కెట్ యార్డుకు తన తెలిసిన కస్టమర్లకు ఆల్ఫా జోళం డెలివరీ చేయడానికి వస్తున్నాడని ఎస్ఐ పెబ్బేరుకు సమాచారం అందింది. వెంటనే ఉన్నతాధికారులకు తెలిపి అక్కడికి సుమారు సాయంత్రం ఐదు గంటల సమయంలో అనుమానిత వ్యక్తులు వచ్చారు వారిని పట్టుకోవడానికి వెళ్తే వారు ఆ ప్రదేశం నుండి పారిపోవడానికి ప్రయత్నించాగా వెంటనే వారిని అదుపులోకి తీసుకొని వారి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే తహసిల్దార్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే డిప్యూటీ తాసిల్దార్ నంద కిషోర్, ఆర్ఐ రాఘవేంద్ర ఆధ్వర్యంలో పంచనామా చేయగా వారి వద్ద నుంచి సుమారు 500 గ్రాముల నిషేధిత అల్ఫా జోలం స్వాధీనపర్చుకోవడం జరిగింది. అనంతరం జిల్లాకు చెందిన గత సంవత్సరం ఒక వివాహ కార్యక్రమంలో కర్నూలుకు చెందిన ఈడిగ గోపాల్ గౌడ్, ఈడిగ జగదీష్ గౌడ్, అనంతపురం జిల్లాకు చెందిన హర్షవర్ధన్ గౌడ్‌తో పరిచయం ఏర్పడింది. వారు ఆల్ఫాజోలం వ్యాపారం గురించి తెలియజేశారు. అనంతపురం జిల్లా మడకశిర నివాసి రామకృష్ణ గౌడ్ అనే వ్యక్తి తనకు ఆల్ఫా జోలం సరఫరా చేస్తున్నాడని దానిని రెండు లక్షల 80 వేలకు రేటు నిర్ణయించుకొని దానిని అవసరమైన కస్టమర్లకు కిలోకు నాలుగు లక్షల చొప్పున అమ్ముకోవచ్చని నరసింహా గౌడ్ తనకు తెలిపిన భాస్కర్ గౌడ్ కి చెప్పాడు. గత సంవత్సరం నుంచి కర్నూలు జిల్లా కోడుమూరు గ్రామానికి చెందిన కుమార్ గౌడ్ నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ గ్రామానికి చెందిన యుగంధర్ గౌడ్, కర్నూలు జిల్లా సంతోష్ నగర్ చెందిన పంథ్ల రమేష్ గౌడ్, గజేందర్ గౌడ్, లక్ష్మణగౌడ్, ఇద్దరు నేరస్తులు కలిసి ఆల్ఫాజోలం వ్యాపారం చేస్తున్నట్టు నిందితులు ఒప్పుకున్నారు. నిందుతులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచడం జరుగుతుందని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ రాంబాబు, ఎస్ఐ యుగంధర్ రెడ్డి, ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, కానిస్టేబుల్ సిబ్బంది పాల్గొన్నారు.



# బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**నారాయణపేట, జూన్ 6 ప్రభాతవార్త :** జిల్లా విద్యా శాఖ నారాయణపేట ప్రజ్వల స్వచ్ఛంద హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో కస్తూర్బాగాంధీ పాఠశాల నందు జిల్లాలోని కేజీబీవీ, మోడల్ స్కూల్, పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెండు రోజుల (5,6వ తరగతి జూన్ 2025) శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణను ఉద్దేశించి మాట్లాడారు. ఆడపిల్లలు కేవలం చదువు పైననే గాక, అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించాలని అందుకోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. కానీ దురదృష్టవశాత్తు కొంత మంది వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగిస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారు. పాఠశాలల్లో చదువుతో పాటు మానవతా విలువలు కూడా నేర్పించాలని, మైనర్ పిల్లలకు వ్యక్తిగత శుభ్రత, శరీర పెరుగుదల మార్పులు, దాని పర్యావసనాల గురించి వివరించాలి, పేరెంట్ టీచర్స్ మీటింగ్స్ కండక్ట్ చేసినప్పుడు పర్సనల్ విషయాలను చర్చించాలి, అలాగే బాల్య వివాహాలను నిరోధించాలి, లైంగిక దాడి బాధితులకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను వివరించాలి. మంచి ఫలితాలు సాధించిన పిల్లలను అభినందించాలని, అలాగే ప్రోత్సహించాలి అని, వారికి ప్రభుత్వాలు అందించే సదుపాయాలు కల్పించాలి, వారిని ఇనిస్టిట్యూషన్స్ సందర్శించే విధంగా ప్రోత్సహించాలి అని అన్నారు. జిసిడిఓ నర్మద మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయులు పిల్లలపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మోసాలకి గురి అయ్యే అవకాశం ఉన్న పిల్లలు (ఆర్ఫాన్, సెమి ఆర్ఫాన్) లను అప్రమతం చేయాలని, సైబర్ ట్రాఫికింగ్ అనేది చాలా వేగంగా వ్యాప్తి చెందుతున్న ఒక నేరపూరిత చర్య మొబైల్ అనేది నిత్య జీవితంలో భాగం అయింది. దీన్ని వాడడం ద్వారా వచ్చే నష్టాలను వివరించాలి. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న నిజమైన వార్తలను వారికి వివరించి దానినుండి బయటపడేలాగా మోటివేషన్ చేయాలి. పిల్లలు ఏదైనా ప్రమాదం ఉందని గమనిస్తే వెంటనే 1098, 100, 181, 1930 లాంటి టోల్ ఫ్రీ నంబర్స్‌ను ఉపయోగించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాఠశాలలో ప్రతి వారం ఒక కొత్త విషయం పై అవగాహన కల్పించాలని వ్యక్తిగత శుభ్రత, ఆపద సమయంలో ఎలా రిపోర్ట్ చేయాలో చెప్పాలని అన్నారు




సమావేశంలో డిఈఓ గోవింద రాజులు, జిసిడిఓ నర్మద, ప్రజ్వల సీనియర్ కోఆర్డినేటర్ సురేష్ కుమార్

**సురేష్ కుమార్ సీనియర్ కోఆర్డినేటర్ ప్రజ్వల:** ప్రజ్వల సంస్థ మనుషుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ పద్మశ్రీ డా. సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 30 వేల మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించడం జరిగింది.ఈ రెండు రోజుల శిక్షణ లో మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం ఎలా జరుగుతుంది, సైబర్ ద్వారా జరిగే నేరాలను ఎలా అరికట్టాలి అనే అంశాలను వివరించడం జరిగింది. మోసం చేసి పిల్లలను బిక్షాటన, సర్కస్, ఇంటి పనులు, చైల్డ్ లేబర్, గాజుల తయారీలో ఉపయోగిస్తున్నారు. లైంగిక వ్యాపారంలో ఎక్కువగా యుక్త వయసు అమ్మాయిలను ఉపయోగిస్తున్నారు, ప్రేమ పెళ్లి సినిమా అవకాశాల పేరుతో మోసం చేస్తున్నారు, అలాగే అక్రమ రవాణా సంబంధిత చట్టాలు బిఎన్‌ఎస్ భారతీయ న్యాయ సంహిత, ఐటిపిఎ ఇమ్మోరల్ ట్రాఫికింగ్ ప్రివెన్షన్ యాక్ట్, పోక్సో ప్రొటెక్షన్ అఫ్ చిల్డ్రన్స్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్, జేజే జువైనల్ జస్టిస్ యాక్ట్‌లపై బృంద చర్చలు, రోల్ ప్లేల రూపంలో వివరించడం జరిగింది. ప్రతి పాఠశాలలో పిల్లలతో విద్యార్థి జాగృతి సంఘాల ఏర్పాటు ద్వారా అవగాహన నివారణ చేయాలని సూచించారు. కాబట్టి ఉపాధ్యాయులు వీటి పై అవగాహన కలిగిఉండి, అప్రమతం చేయాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు, జిసిడిఓ నర్మద, ప్రజ్వల స్టేట్ కోఆర్డినేటర్ సురేష్ కుమార్, కోఆర్డినేటర్ రాము, నారాయణపేట జిల్లా కేజీబీవీ, మోడల్ స్కూల్స్ నుండి ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ నేతృత్వంలోనే అభివృద్ధి సంక్షేమం

**మానవపాడు, జూన్ 6 ప్రభాతవార్త :** భారత ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సంక్షేమం వైపు దూసుకెళ్తుందని అందులో భాగంగా రైల్వే శరవేగంగా అభివృద్ధి చెందుతుందని బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఉండవల్లి మండల పరిధిలోని తక్కశిల గ్రామంలో బిజెపి మండల అధ్యక్షులు పిడుగు వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న జోగులాంబ హాల్టును స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తంబ్లింగ్ విద్యుదీకరణ వందే భారత్ నూతన రైల్వే మార్గాలు దేశంలో ఉన్న రైల్వే స్టేషన్ల ఆధునికరణ అందుకు ఉదాహరణలు అని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో అన్ని రంగాలు అభివృద్ధి పథంలో ఉన్నాయని తెలిపారు. బిజెపి ప్రభుత్వం ఆర్థిక సామాజిక సాంకేతిక విభాగాల్లో రెట్టింపు స్థాయిలో తీసుకెళ్తుందని దేశ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. మోడీ అమలుపరుస్తున్న పలు అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తీసుకెళ్లాలని బిజెపి నాయకులకు సూచించారు. అన్ని బూతుల్లో ప్రధాన కూడల్లో,చర్చలు రచ్చబండల వద్ద పథకాలపై అవగాహన కల్పించాలని వారికి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బిజెపి నేతలు రాజగోపాల్, నాగేశ్వర్ రెడ్డి, రాజశేఖర్ శర్మ, ఉపేందర్, గోపి, సుంకన్న, రాజేశ్వర్ రెడ్డి,చందు తదితరులు పాల్గొన్నారు



రైల్వే పనులను పరిశీలిస్తున్న బిజెపి నాయకులు

**ఇటిక్యాలలో బిజెపి నాయకుల సమావేశం....** వీక్షిత్ భారత్ అంటే అభివృద్ధి చెందిన భారతదేశం భారత ప్రధాని నరేంద్ర మోడీ పాలన 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వికసిత్ భారత్ 2024 లక్ష్యంగా భారతదేశం 2047 లో 100 సంవత్సరాల స్వాతంత్రపు వార్షికోత్సవం నాటికి భారతదేశాన్ని పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని లక్ష్యంగానే మోడీ ప్రభుత్వం కొనసాగుతుందని రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ అక్కల రమా సాయిబాబా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బిజెపి నాయకులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు షేక్ అబ్దుల్లా , బీజేవైఎం కిషోర్ ,ప్రధాన కార్యదర్శి పరుష, కోశాధికారి నాగమణి బూత్ అధ్యక్షులు వీరన్న, మహేష్ మహమ్మద్ రఫీ కృష్ణ మధు,రాముడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు : డీఈఓ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 6 ప్రభాతవార్త:** జిల్లాలో ప్రారంభమైన బడిబాట, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని డీఈఓ రమేష్‌కుమార్ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. బడిబయటి పిల్లల్ని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖాధికారి ఏ రమేష్ కుమార్ ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం తాడూరు, వెల్దండ, కల్వకుర్తి మండల కేంద్రాల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ రమేష్ కుమార్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి, మెరుగైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థులను ఉన్నత లక్ష్యంతో తీర్చిదిద్దే బాధ్యత కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉంటుందని తెలిపారు. ఈనెల 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని సూచించారు. ఈ నెల 12వ తేదీన పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, ఏకరూప దుస్తులు అందజేయాలని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ బోధనను క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి, అలాగే ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన తీరును క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తూ విద్యార్థుల నమోదును పెంచాలని అన్నారు. అనంతరం బడిబాట ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ బరపటి వెంకటయ్య, టెస్ట్ బుక్ మేనేజర్ మనపాడు నరసింహులు, ఎంఈఓలు శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌నాయక్, చంద్రుడునాయక్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.




బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ రమేష్‌కుమార్

### ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా

## ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు

**నారాయణ పేట, జూన్ 6 ప్రభాతవార్త :**బక్రీద్ పండుగను జిల్లా ప్రజలు మతసామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపి, ఎస్పీ మాట్లాడుతూ త్యాగానికి ప్రతికగా ముస్లిం సోదరులు జరుపుకునే బక్రీద్ పర్వదినం కోసం పోలీస్ అధికారులు అన్ని భద్రత ఏర్పాట్లు చేశామని, బక్రీద్ పండుగ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అందుకు పోలీసు అధికారులకు భద్రతాపరమైన సూచనలు ఇవ్వడం జరిగింది అని ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. నారాయణపేట జిల్లా పరిధిలో ఉన్న ఈద్గాల దగ్గర ప్రార్థన మందిరాల వద్ద ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా పండగ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రజలకు ఏలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్స్ ఏర్పాటుచేసి,అవసరం ఉన్నచోట పోలీస్ పికెట్స్ ఏర్పాటుచేసి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలంతా మతసామరస్యాన్ని కాపాడుకుంటూ సామరస్యంగా, శాంతియుతంగా పరస్పరం ఇతర మతాలను గౌరవించుకుంటూ తమ పండగలను సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ కోరారు. ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మకూడదని తెలియజేశారు. సోషల్ మీడియాలో పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఎవరైనా వివాదాస్పదంగా పోస్టులు చేస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా ప్రజలు అత్యవసర సమయంలో 24/7 పోలీస్ కంట్రోల్ రూమ్ 8712670399 కి, డయల్ 100 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్లకు సంప్రదించాలని ఎస్పీ కోరారు.

## జర్నలిస్టుపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

**టి యు డబ్ల్యూ జె(ఐజేయు) జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరావు, సీనియర్ జర్నలిస్టు ఊషన్న**

**వనపర్తి ప్రతినిధి, జూన్ 6 ప్రభాతవార్త :** జనం సాక్షి పత్రిక ఎడిటర్ ముజీబుర్ రెహమాన్‌పై పోలీసులు అక్రమ కేసు నమోదు చేయటం పత్రికా స్వేచ్ఛపై దాడేనని వెంటనే తనపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని టియుడబ్ల్యూ జె(ఐజేయు)జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరావు, సీనియర్ జర్నలిస్టు ఊషన్న అన్నారు. శుక్రవారం వనపర్తి రాజీవ్‌చౌక్‌లో రహమాన్‌పై పోలీసులు అక్రమ కేసు నమోదు చేయడం పై టియుడబ్ల్యుజె (ఐజెయు)యూనియన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం పత్రిక స్వేచ్ఛను హరించివేయడమేనని, రహమాన్‌పై కక్ష సాధింపు చర్యలు ఆపాలని అన్నారు. పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రత్యక్షంగా రెహమాన్ ఘటనాస్థలిలో లేకపోయినా ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం రాజోలి పోలీసులు కేసు నమోదు చేయడం అప్రజాస్వామికం అని తెలిపారు. ఇది పత్రిక స్వేచ్ఛపై దాడి చేయడమే అని మండిపడ్డారు. ప్రజల నిరసన, వ్యతిరేకతను జనంసాక్షి దినపత్రిక కళ్లకు కట్టినట్లు ప్రచురించడాన్ని ఫ్యాక్టరీ యాజమాన్యం జీర్ణించుకోలేక ఇలా అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు. పోలీసుల చర్యను తీవ్రంగా ఖండిస్తు, ఎడిటర్ రెహమాన్‌కు పాత్రికేయ లోకం మద్దతుగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వార్త స్టాఫ్ రిపోర్టర్ బెక్కరీ విజయ్,ఎన్ టివి అంజి, 99 టీవీ నరసింహారాజు, ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ అరుణ్ రాజ్, మన తెలంగాణ రిపోర్టర్ తిరుపతయ్య, మనం స్టాఫ్ రిపోర్టర్ దాచా హరీష్ కుమార్, శేఖర్, రమేష్, అంజి, ముజ్జు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐజేయు నాయకులు

## విస్తృతంగా పోలీస్‌ల తనిఖీలు

**శ్రీరంగాపూర్, జూన్ 6 ప్రభాతవార్త :** శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేని వాహనాలు నడిపితే అలాంటి వాహనాలను సీజ్ చేయబడతాయని వారు తెలిపారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, వాహనాన్ని నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని వారు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అశోక్, భగీరథ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ చొరవతో దివ్యాంగులకు చేయూత

**మక్తల్,జూన్6 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రత్యేక చొరవతో మక్తల్ ప్రాంతంలోని దివ్యాంగులకు చేయూతనందిస్తున్నామని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా.టి. లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. ఎంపీ సహకారంతో అలెంకో సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో దివ్యాంగులకు ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు అవసరమైన చలన పరికరాల పంపిణీ కోసం అర్హులైన వారి వివరాలను నమోదు చేశారు. అర్హులైన దివ్యాంగులకు త్వరలోనే పరికరాలను అందజేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ సరోజినీ, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కర్ని స్వామి, మాజీ ఎంపిటిసి జి. బలరాం రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు అమ్మక్క, అరుణ, బిజెపి నాయకులు బి.రాజశేఖర్ రెడ్డి, నల్లె నర్సప్ప, జయానంద రెడ్డి,ప్రతాపరెడ్డి, చంద్రశేఖర్, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు రమేష్ రావు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు

**నారాయణపేట టౌన్, జూన్ 6 ప్రభాతవార్త :** ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ అడ్మిషన్లు 2025,26 విద్యాసంవత్సరానికి సంబంధించి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ హైదరాబాద్ ఎస్ఎస్‌సి ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభమైనవి. ఆసక్తిగల అభ్యర్థులు అప్లై చేసుకోవచు. వివరాలకు స్టడీ సెంటర్ పిఎం జెడ్‌పిహెచ్‌ఎస్ దామరగిద్ద సెల్ నెంబర్ 9490322492ను సంప్రదించగలరు.

## నిరాడంబరంగా నామాజీ జన్మదిన వేడుకలు

**నారాయణపేట టౌన్, జూన్ 6 ప్రభాతవార్త :** ఉద్యమాల ముద్దుబిడ్డ జనహృదయనేత తెలంగాణ బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ జన్మదిన వేడుకలు శుక్రవారం నిరాడంబరంగా తన కుటుంబ సభ్యులు ఇద్దరు కుమారులు, కోడళ్ళు, మనువలు, మనుమరాళ్లతో కలిసి శ్రీశైలం మల్లికార్జున స్వామి సన్నిధిలో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తన సొంత ప్రాంతం జిల్లా తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## నోట్ బుక్కుల, బ్యాగుల పంపిణీ

**నారాయణపేట టౌన్, జూన్ 6 ప్రభాతవార్త :** పాఠశాలలు పునః ప్రారంభం కాబోతున్న సందర్భంగా శుక్రవారం నారాయణపేట పట్టణంలోని 28వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నారాయణ పేట టౌన్ అధ్యక్షులు యూసుఫ్ తాజ్ ఆధ్వర్యంలో 50 మంది నిరుపేద విద్యార్థులకు నోట్ బుక్కులు, బ్యాగులు, పెన్నులు, పలకలు అందజేశారు. నిరుపేద విద్యార్థులకు బ్యాగులు బుక్కులు పంపించడం పట్ల కాలనీ వాసులు అభినందించారు. పంపిణీ కార్యక్రమంలో వార్డుయువకులతో పాటు ఉన్నారు.

## మండల ఈ పంచాయతీ ఆపరేటర్లకు వేతనాలు పెంచాలి

**ఇటిక్యాల, జూన్ 6 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లాలో మండల పరిషత్ కార్యాలయాలలో పనిచేస్తున్న ఈ పంచాయతీ ఆపరేటర్లకు వేతనాలు పెంచాలని శుక్రవారం జిల్లా ఇన్చార్జి పంచాయతీ అధికారి నాగేంద్రకు జిల్లాఈపంచాయతీ ఆపరేటర్ల సంఘంఅధ్యక్షులు భార్గవ్‌రెడ్డి.ప్రధానకార్యదర్శి రాకేష్‌రెడ్డి, కోశాధికారి జగదీష్ ఆయా మండలాల ఆపరేటర్లు వినతి పత్రం ఇచ్చారు.

## గనులు భూగర్భ శాఖ జీరో అనుమతి పద్ధతిని వినియోగించుకోవాలి

**స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్**

**నారాయణ పేట, జూన్ 6 ప్రభాతవార్త :** జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖలు చేపట్టిన నిర్మాణాలకు బిల్డింగ్ స్టోన్, రోడ్ మెటల్ (కంకర రాయి) గ్రావెల్ (మొర్రం) కొనుగోలు చేయడం కోసం గనులు,భూగర్భ శాఖ ప్రవేశపెట్టిన జీరో పర్మిట్ సిస్టం ను వినియోగించుకోవాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. నారాయణపేట జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో శుక్రవారం అదనపు కలెక్టర్ అధ్యక్షతన జిల్లా అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గనుల భూగర్భ శాఖ జీరో పర్మిట్ సిస్టం ద్వారా ప్రభుత్వానికి చెల్లించే రెవెన్యూ లీకేజీని అరికట్టవచ్చని, అలాగే ప్రభుత్వ పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు ఖనిజాల కొనుగోలు సులభతరం అవుతుందని ఆయన తెలిపారు. జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ నిర్మాణాలలో ఉపయోగించే ఇసుక తెలంగాణా మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి బల్క్ ఆర్డర్ల ద్వారా ఇసుక కొనుగోలు చేయవలసిందిగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని అదనపు కలెక్టర్ చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మన నారాయణపేట జిల్లాలో ప్రభుత్వ ఇంజనీర్ శాఖలు చేపట్టిన నిర్మాణాలకు ఇసుక తెలంగాణా మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో గనులు భూగర్భ శాఖ సహాయ సంచాలకులు సంజయ్ కుమార్, డిఎస్పీ నల్లపు లింగయ్య, పీ.ఆర్. ఈఈ హిర్యా నాయక్, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్,ఇరిగేషన్ ఈఈ బ్రహ్మానందం, మిషన్ భగీరథ ఈఈ రంగారావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, నారాయణపేట జిల్లాకు చెందిన వివిధ ఇంజనీరింగ్ శాఖల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.